ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023 5
అనంతపురం





శాలువాలు, హాట్‌బాక్సులను వెనక్కు ఇచ్చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అవార్డులకు ఎంపిక చేయకుండా అవమానం

◆'మీ హాట్‌బాక్సులు, శాలువాలు మాకు అక్కర్లేదు'..
◆ వెనక్కు ఇచ్చేసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

'ప్రజల ఆరోగ్యం, వసతుల కోసం మా ప్రాణాలను ఫణంగా పెట్టి విధులను నిర్వహిస్తున్నాం... ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు తమ సేవలను గురించకపోగా, అవమానించేలా వారి చర్యలు ఉన్నాయి... స్వాతంత్ర దిన్సోవం రోజున అవార్డులకు తమను ఎంపిక చేయకుండా కేవలం కార్యాలయం బయట శాలువాలు, హాట్‌బాక్సులు ఇచ్చారు... ఇది నిజంగా కార్మికులను అవమానించడమే... ఇలాంటి బహుమానాలు మాకు అక్కర్లేదు'.. అని అనంతపురం కార్పొరేషన్ మున్సిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులు ఇచ్చిన హాట్‌బాక్సులు, శాలువాలను వారికే వెనక్కు ఇచ్చేశారు. సోమవారం నాడు అనంతపురం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రిని సిఐటియు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు కలిసి వారి సమస్యలు, అధికారులు వ్యవహరించిన తీరును తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ 77వ స్వాతంత్ర దినోత్సవం నాడు కలెక్టర్ చేతులు మీదుగా అందజేసే అవార్డులకు కార్మికులను ఎంపిక చేయకుండా, కమిషనర్ భాగ్యలక్ష్మి అవమానించారన్నారు. అవార్డులు ఇవ్వకుండా కార్యాలయంలో హాట్‌బాక్సులు కార్మికులకు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను ప్రభుత్వ అవార్డుకు ఎంపిక చేయకపోవడం వారిని అవమానించడమే అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేసిన కార్మికులను గుర్తించకపోవడం దుర్మార్గం అన్నారు. కార్మికులకు బకాయి ఉన్న తొమ్మిది నెలల ఈపీఎఫ్ నగదును వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీనిపై దాదాపు 50 సార్లు స్పందనలో వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. 60 సంవత్సరాల పేరుతో తొలగించిన 12 మంది ఇంజినీరింగ్ కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. అనారోగ్యం, ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మిక కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐలలో ఉన్న తప్పులను సవరించి కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. కార్మికులపై అధికారుల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ స్వాతంత్ర దినోత్సవం రోజున సన్మానం పేరుతో వారిచ్చిన శాలువాలు, హాట్‌బాక్స్‌లను వెనక్కు ఇచ్చేశామన్నారు. అనంతరం సమస్యల పరిష్కారంపై ఈనెల 24వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులంతా తరలి వెళ్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కర్నాటక వైపు రఘువీరా చూపు

పార్లమెంటు ఎన్నికల బరిలో దిగుతారా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి చూపు కర్నాటక రాజకీయాల వైపు మళ్లిందా అన్న చర్చ రాజకీయాల్లో నడుస్తోంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కర్నాటక నుంచి పోటీ చేసే అవకాశాలున్నట్టు ప్రచారం సాగుతోంది. కర్నాటక రాజకీయాల్లోనూ చర్చ నడుస్తున్నట్టు అక్కడి మీడియా కథనాలు కూడా రావడం బలాన్ని చేకూరుస్తోంది. ఇటీవల కర్నాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ కొన్ని నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని ఆయన పాల్గొన్నారు. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయాలు సైతం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, అనంతపురం జిల్లాలోనూ ఎన్.రఘువీరారెడ్డికి ప్రత్యేకమైన స్థానముంది. మూడు పర్యాయాలు మంత్రిగానూ పనిచేశారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతపురం జిల్లాపైనా ఆయనకు ప్రత్యేకమైన స్థానముంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెసు పార్టీ పూర్తిగా దెబ్బతింది. ఈ సమయంలోనూ ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను చేపట్టి పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సాయశక్తుల కృషి చేశారు. కాని 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెసు పార్టీలో మెరుగుదల కనిపించలేదు. అప్పటి నుంచి పిసిసి అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. స్వగ్రామానికే పరిమితమయ్యారు. ఆయన ఊరు నీలకంఠాపురంలో దేవాలయాల నిర్మాణాలు చేపడుతూ పూర్తిగా ఆధ్యాత్మిక మార్గం వైపు నడిచారు. ఇక రాజకీయాలకు దూరమైనట్టే అన్న భావన సైతం అందరిలోనూ నెలకొంది. అయితే తిరిగి కాంగ్రెసు జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ దేశ్ జోడో యాత్ర సమయంలో ఆయనతోపాటు కలసి ఆంధ్రప్రదేశ్‌లోని డీ.హీరేహల్ ప్రాంతంలో పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నారు. తుముకూరు ప్రాంతంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడ కాంగ్రెస్‌కు మంచి ఆధిక్యత కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన్ను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అక్కడి నుంచి బరిలో దింపితే ఎలాగుంటుందన్న ఆలోచనలో ఆ పార్టీ వర్గాల్లో సాగుతున్నట్టు సమాచారం. ఈ ప్రచారంతో ఆయన ఇప్పటి వరకు ఉన్న మౌనం వీడి ఇక క్రియాశీలకంగా మారుతారా అన్నది చర్చనీయాంశమవుతోంది. ఇప్పటి వరకు ఆయన పార్టీ మారుతారా అన్న ప్రచారానికి తెరపటినట్టే కనిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దయనీయంగా మారడంతో అటు టిడిపిగాని, ఇటు వైసిపిగాని చేరుతారన్న ప్రచారం ఇక్కడ సాగింది. కాని అందుకు భిన్నంగా ఆయన కాంగ్రెస్ పార్టీలోనే పక్క రాష్ట్రం వైపు మొగ్గుపుతున్నట్టు కనిపిస్తున్నారు. ఇప్పటికే ఆయనకు సిడబ్లుసి శాశ్వత సభ్యుడిగానూ నియమించింది. దీన్నిబట్టి కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆయనకు ఏ మేరకు ప్రాధాన్యతనిస్తోందన్నది స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలో కీలకమైన కమిటీలో చోటు కల్పించడం మరింత ప్రాధాన్యత కల్పించినట్టయింది. కర్నాటక కాంగ్రెసు రాజకీయాల్లోనూ ఆయన క్రియాశీలకంగా మారే అవకాశాలున్నట్టు రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

మున్సిపల్ కార్మికుల బైకు ర్యాలీలు



అనంతపురంలో బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రగకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 24న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు గాంధీ సర్కిల్ మీదుగా సాగి తిరిగి నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, సిఐటియు నగర ఓల్డ్‌టౌన్ కార్యదర్శి వై.వెంకటనారాయణ, పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం జిల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి : మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, గాంధీచౌక్ మీదుగా రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ బైకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో గుత్తి మున్సిపల్ పారిశుధ్య, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, గుత్తి మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి కె.బాల రంగన్న, వై.నాగేష్, ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, దాదు, సాదిక్, రవి తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

గుంతకల్లు : సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం కొనసాగింపు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతన, ఉద్యగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర కమటీ పిలుపు మేరకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మహాత్మా గాంధీ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కె.నరసయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేకపోతే ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు,నాయకులు పెంచలయ్య, ప్రేమ్ కుమార్, ఖాజా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్న రైతులను ఆదుకోవాలి

◆దశలవారీ ఉద్యమాలకు శ్రీకారం ◆సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి... ముఖ్యమంత్రి ప్రత్యక్ష్యంగా పరిశీలించి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ పంటల పరిస్థితిపై కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ వరకు జిల్లాలో ఎండుతున్న పంట పొలాలను పరిశీలన, 28వ తేదీ జిల్లా కేంద్రంలో రైతు, కూలీలతో చర్చావేదిక, సెప్టెంబర్ 1న రైతు భరోసా కేంద్రాల వద్ద నిరసనలు, సెప్టెంబర్ 4వ తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో సాధారణ సాగు 9.15 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, 6 లక్షల ఎకరాల్లోపు మాత్రమే సాగు జరిగిందన్నారు. 4 లక్షల ఎకరాల్లో కనీసం విత్తనం కూడా వేయలేకపోయారని తెలిపారు. 168 మిల్లీమీటర్‌లకు గాను 127 మిల్లీమీటర్‌లు వర్షం మాత్రమే పడిందన్నారు. దీని వల్ల 21 మండలాల్లో వర్షాభావం నెలకొందన్నారు. ఇప్పటికే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. జిల్లా రైతులను ఆదుకునేందుకు పంట వేసి నష్టపోయిన వారికి ఎకరాకు కనీసం రూ. 50 వేలు, పంట సాగు చేయని రైతులకు ఎకరాకు రూ. 30 వేలు, వ్యవసాయ పనులు కోల్పోతున్న కూలీలకు ఉపాధి హామీ పథకం కింద అదనంగా వంద రోజులు పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, బి.శ్రీనివాసులు, వి.సావిత్రి, జిల్లా కమిటి సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, వి.రామిరెడ్డి, భాస్కర్, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, అచ్యుత్, మల్లికార్జున, రంగారెడ్డి, జగన్, నిర్మల, నాగమణి, వెంకటనారాయణ, ముస్కిన్, సూర్యచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సుఖప్రసవాలకు చర్యలు తీసుకోవాలి

డిఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్

ప్రజాశక్తి-అనంతపురం

సుఖ ప్రసవాలకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. సోమవారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ భవనంలో సుఖ ప్రసవాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన గర్భిణీ, స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ కుముద శిక్షణ ఇచ్చారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్‌ఓ యుంగధర్ మాట్లాడుతూ ప్రమాదకర లక్షణాలు ఉండే గర్భిణులను గుర్తించాలన్నారు. అప్పుడే వారిని సాధారణ పరిస్థితులకు తీసుకొచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్న గర్భిణులకు అవసర పరిస్థితుల్లో కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని ఉపయోగించుకునే అవగామన కల్పించాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత కలిగిన గర్భిణులు గర్భం దాల్చడానికి ముందు షుగర్, బ్లడ్ ప్లెసర్, గుండె జబ్బులు, థైరాయిడ్ వంటి పరీక్షలు చేయాలన్నారు. అలాగే 140 సెంటీమీటర్స్ కన్నా తక్కువ ఎత్తు, చిన్న వయసుకే గర్భం దాల్చడం, ఎక్కువ వయస్సులో గర్భం దాల్చడం, ఎక్కువసార్లు గర్భం దాల్చడం, కాన్పుకూ కాన్పుకు మధ్య ఎడమ లేకపోవడం, మూర్ఛ రావడం వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహింద్రనాథ్, కావ్య, రోహిణీ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్

ఈక్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో చేపట్టిన ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి ఈక్రాప్ బుకింగ్, పిఎం కిసాన్, సివిల్ సప్లయిస్, రీసర్వే, నాడు-నేడు, ఉపాధి హామీ, స్పందన గ్రీవెన్స్, తదితర అంశాలపై ఆర్డీవోలు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియను సెప్టెంబర్ 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పొలాలకు అధికారులు వెళ్తున్నారా.. లేదా.. అనేది పరిశీలించాలని, రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈక్రాప్ బుకింగ్‌ను పక్కాగా నమోదు చేయాలన్నారు. పిఎం కిసాన్ పథకానికి సంబంధించి పోర్టల్‌లో రైతుల వివరాలు అప్డేట్ చేయాలన్నారు. అర్హులైన వారికి బియ్యం కార్డులను గడువులోపు అందించాలని, ఇందుకు సంబంధించి 26 అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలో పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, చిన్న చిన్న ఫిర్యాదులు కూడా రాకుండా సకాలంలో రీసర్వే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణాలు వేగంగా చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ ప్రశాంత్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజారావు, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, డిటిడబ్ల్యుఓ అన్నాదొర, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచాలి

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచేలా నాణ్యత కలిగిన పరిష్కారం చూపించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో భాగంగా 408 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ గడువులోపు పరిష్కరించేందుకు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. అర్జీదారునికి ఫోన్ చేసి మాట్లాడాలని, సంతప్తికర పరిష్కారం చూపిస్తున్నామని తెలియజేయాలన్నారు. ఇప్పటివరకు పరిష్కరించిన జగనన్నకు చెబుదాం పిటిషన్లలో హౌసింగ్ శాఖ, ఏపీఎస్పీడీసీఎల్, తదితర శాఖలకు సంబంధించి సంతప్తి చెందని కేసులు ఎక్కువగా ఉన్నాయని, సంతప్తి స్థాయి మరింత పెరిగేలా నాణ్యమైన పరిష్కారం చూపించడం అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, నీలమయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జెడీ ఉమామహేశ్వరమ్మ, సిపిఓ ప్రశాంత్ కుమార్, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజరావు, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, డిటిడబ్ల్యుఓ అన్నాదొర, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా, ఫిషరీస్ డిడి శాంతి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఎంపిపి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం లో సభ్యులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో పైపులైన్లు, ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు, సచివాలయం, ఆర్‌బికె భవనాలు, హెల్త్ సబ్ సెంటర్లు మంజూరైట్లు తెలిపారు. దీనిపై ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ భవన నిర్మాణాలకు ఇసుక సమస్య ఉందని, గుండ్లపల్లి క్రాస్‌లో ఉన్న రీచ్ నుంచి ఇసుక తేవాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుందన్నారు. స్థానికంగా ఇసుకకు అనుమతి ఇస్తేనే వాటి నిర్మాణ పనులు మందుకు సాగుతాయని స్పష్టం చేశారు. తుంగభద్ర ఆయకట్టుకు సాగునీరు అందించే అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైందని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు నిధులు లేవని సర్పంచులు వాపోయారు. 'ఇంటింటికీ కొళాయి' కార్యక్రమం కొన్ని గ్రామాల్లో ఆగిపోయిందన్నారు. చిరుధా న్యాల విత్తనాలను ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రామాల్లో సిసి రోడ్లకు ఇరువైపులా గ్రావెల్ వేయలేకపో వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఏలంజి ఎంపిటిసి సభ్యుడు తిమ్మప్ప ధ్వజమెత్తారు. వైఎస్ఆర్ గృహాల నిర్మాణం పట్ల వినియోగదారులు ఆసక్తి చూపుతున్నా ఇసుక కొరత వేధిస్తుందని సభ్యులు మండిపడ్డారు. అనంతరం పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకోసారి పశుబీమా కంతు చెల్లిస్తేనే బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ షకీలాబేగం, తహశీల్దార్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు : మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలోని అర్హులందరికీ సిఎం జగన్ ఇళ్లు మంజూరు చేస్తారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. మండల పరిధిలోని పాతచెరువు గ్రామ జగనన్న కాలనీలో సోమవారం మంత్రి నూతన ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే ఇల్లు మంజూరయ్యేదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరవుతుంద న్నారు. పేదవారి సొంతింటి కల నెరవేరుతోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి ఉషాశ్రీచరణ్


రేపు అర్బన్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన నూతన అర్బన్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం(నేడు) రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కురుకుల తోట, పట్టణంలోని ఇందిరమ్మ కాలనీల్లో ఏర్పాటు చేసిన అర్బన్ క్లినిక్‌లను ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. బుధవారం నుంచే ఈ క్లినిక్‌లలో సేవలు అందిస్తారని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సర్వే చేసి ప్రహరీ నిర్మించాలి

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి



ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రజాధనం వృథా కాకుండా రోడ్డు సర్వే చేసి కళాశాల ప్రహరీని నిర్మించాలని, అలా చేసే తానే రూ.5లక్షలు అభివృద్ధి పనులకు ఇస్తానని మున్సిపాలిటీ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రిలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రోడ్డుకు సంబంధించి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో 52 సెంట భూసేకరణ చేపట్టి రూ.30 లక్షలు చెల్లించినట్లు గుర్తు చేశారు. తనకు సొంతంగా ఎలాంటి లాభనష్టాలు లేవన్నారు. ప్లాస్టిక్ నిర్మాణంలో దేశంలోనే తాడిపత్రి పట్టణం అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. తాను ఎప్పుడూ అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. అయితే ప్రజాధనం వృథా కాకుండా సర్వే చేసి రోడ్డు వేస్తే శాశ్వతంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో రోడ్డు పెద్దగా వేయాలంటే తొలగించాల్సి వస్తుందని, అలా చేస్తే ప్రజాధనం వృథా అవుతుందనేది తన అభిప్రాయం అన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తాడిపత్రి జియోగ్రఫీ చరిత్ర తెలియదన్నారు. చెబితే వినరని తనపైన ఉన్న పట్టింపులతో ఊరు పాడు చేయద్దని విన్నవించారు. సర్వే చేయించి నిర్మాణం చేపట్టాలని చెబుతుంటే రాద్ధాంతం చేస్తూ పోలీసుల పర్యవేక్షణలో నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కూల్చడం ఎంతోసేపు పట్టదని, ప్రజాధనం వృథా కాకూడదనే తన ఉద్దేశమన్నారు. తాను దేనికీ వ్యతిరేకం కాదని ఉన్నతాధికారులు భయపడకుండా నిర్భయంగా పని చేయలేనప్పుడు దయచేసి ఐఎఎస్, ఐపిఎస్ అని చెప్పుకోవద్దని సూచించారు.

కావాలనే 'నాడు-నేడు' పనుల అడ్డగింత

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ప్రజాశక్తి-తాడిపత్రి

అభివృద్ధిని జీర్ణించుకోలేకనే నాడు-నేడు కింద చేపట్టిన జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణాన్ని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రహరీని నిర్మించరాదనే ఆలోచనతోనే జెసి ప్రభాకర్‌రెడ్డి నిర్మాణంలోని కడ్డీలను తీసివేసి రోడ్డు రోలర్‌ను అడ్డంగా పెట్టారన్నారు. అంతేగాకుండా పనులను అడ్డుకుంటూ పోలీసులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడన్నారు. అతని అనుచరులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకోవచ్చుగానీ, ప్రభుత్వం మాత్రం ప్రజలకు అవసరమైన కార్యక్రమాలు చేస్తుంటే వద్దంటున్నాడన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడమేనా అతనికి తాడిపత్రిపై ఉన్న అభిమానం అని నిలదీశారు. ఇకపోతే టిడిపి ఇన్‌ఛార్జి అస్మిత్‌రెడ్డి వారాంతపు రాజకీయాలు చేయడమేకాకుండా సమస్యాత్మక కార్యక్రమాలకు టిడిపి కార్యకర్తలను ఆహ్వానిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టిన ప్రహరీ నిర్మాణం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, పట్టణ ఆరోగ్య కేంద్రం, వంద పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి పనులను అడ్డుకుంటూ పబ్బం గడుపుకోవాలనుకోవడం ప్రభాకర్‌రెడ్డికి పరిపాటిగా మారిందన్నారు. రైల్వే అండర్ పాస్‌తో రోడ్డు ఏర్పాటు చేస్తే ఆటోనగర్ కార్మికులు, ప్రజలు, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్న జేసీ... 60 అడుగుల రోడ్డుకు తాను సంపూర్ణంగా సహకరిస్తానని, అయితే అందుకు అవసరమైన స్థలాన్ని ఇచ్చేందుకు సహకరించాలని సూచించారు.

దేవీబాయి పిల్లలను ఆదుకోవాలని వినతి

అనంతపురం కలెక్టరేట్ : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన గిరిజన పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్, జిల్లా అధ్యక్షులు ఎస్.బాలాజీనాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు అనంతపురం రూరల్ మండలం, నరసనాయనికుంట గ్రామానికి చెందిన కుళ్లాయినాయక్, దేవీబాయి పిల్లలతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ ఎం.గౌతమికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల గతంలో తండ్రి కుళ్లాయినాయక్ ప్రమాదంలో మృతిచెందగా ఇటీవల తల్లి కూడా క్యాన్సర్‌తో చనిపోయిందన్నారు. దీంతో పిల్లలు దిక్కులేని వారుగా మిగిలారన్నారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణబాయి, గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

పుట్లూరు : మండల కేంద్రంలోని సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఉద్యోగులు సోమవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను చెల్లించాలని, మినిమం టైంస్కేల్‌ను వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఇఓ అశ్వర్థ, ఎంఐఎస్ లక్ష్మి, సిఆర్‌పిలు వీరయ్య, జయచంద్ర, నారాయణస్వామి, లజరయ్య, మెసేంజర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్‌కు సన్మానం

నార్పల : ఇటీవల మండల కేంద్రంలోని 8వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన టిడిపి మద్దతుదారు వార్డు సభ్యులు కొత్తమిద్దె నాగభూషణంను టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, నాగార్జుననాయుడు సోమవారం నార్పలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రభంజనం మొదలైందన్నారు. 2024లో రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రబాబు, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉరవకొండ : ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే సాధారణ సమావేశం నిర్వహించాలని వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, మీనుగ రామాంజనేయులు, మీనుగ రవి, ముస్కిన్ సాహెబ్ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఇఒ గౌస్‌సాబ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ జూన్ 23న సాధారణ సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమం ఉందని అర్ధాంతరంగా వాయిదా వేశారన్నారు. వాయిదా వేసి 60 రోజులు గడుస్తున్నప్పటికీ ఎందుకు సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. పంచాయతీలో సీజనల్ వ్యాధులు, తాగునీటి సమస్య, పారిశుధ్యం, గృహ నిర్మాణ అనుమతుల ఆమోదం, విద్యుత్ దీపాలు తదితర అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే సమావేశం నిర్వహించి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిలాన్, రమేష్ పాల్గొన్నారు.

సైకిల్‌యాత్రను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల



గుత్తిలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

జిల్లా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 23 నుంచి 30వతేదీ వరకూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్ పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం గుత్తిలోని ఎమ్మెస్ జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో విద్యను అభ్యసించడానికి సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారని వారు మధ్యాహ్నం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న తాడిపత్రి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివనాయక్, నరేష్, చందు, సతీష్, నాగార్జున, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : జిల్లా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 23 నుంచి 30వతేదీ వరకూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, మండల నాయకులు వర్ధన్‌బాబు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సైకిల్ యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర ఆగస్టు 23న తాడిపత్రిలో ప్రారంభమై గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కనేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా ఈనెల 30వతేదీ అనంతపురానికి చేరుకోనున్నట్లు తెలిపారు. కావున జిల్లావ్యాప్తంగా సాగనున్న సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర, వెంకటేష్, రఘు, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టను న్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ సైకిల్ యాత్ర ఈ నెల 23వ తేదీ తాడిపత్రి పట్టణంలో ప్రారంభమై గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణ దుర్గం మీదుగా 30వ తేదీ అనంతపురం నగరం చేరుకుంటుందన్నారు. తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా సెంట్రల్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీలు చేయలేదని, కనీసం ప్రహరీ కట్టలేదన్నారు. వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడం లేదన్నారు. రాయదుర్గం, డి.హీరేహాల్, శింగనమల, ఉరవ కొండ, తాడిపత్రి, ఆత్మకూరు, గుత్తి జూనియర్ కళాశాలల్లో సరైన సదుపాయాలు లేవన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు అనుబంధ హాస్టళ్లు, కెజిబివిల్లో డిమాండ్ మేరకుసీట్లు కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డిగ్రీ విద్యలో మేజర్, మైనర్ సబ్జెక్టు విధానం తీసుకొచ్చి, నాలుగేళ్లకు పెంచి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారన్నారు. కార్పొ రేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయడం లేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికై చేపడుతున్న సైకిల్ యాత్రకు మేధావులు, విద్యార్థులు సంఘీభావం తెలిపి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరి, లోకి, వీరేష్, లోకేష్, ప్రేమ్, జోసఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగులకు పింఛన్ రూ.6 వేలు ఇవ్వాలి

ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎం.రామయ్య



కలెక్టర్‌తో మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వికలాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హెచ్.వసంత కుమార్, ఎం.రామయ్య, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ ఛైర్మన్ సాకే హరి డిమాండ్ చేశారు. ఈమేరకు వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది విభిన్న ప్రతిభావంతులు 21 రకాల వికలాంగత్వంతో ఉన్నారన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుకూలంగా వికలాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచాలని కోరారు. అలాగే 2019 నుంచి వివాహ ప్రోత్సాహకాలు చెల్లించలేదని తక్షణమే చెల్లించాలన్నారు. వికలాంగులకు 35 కేజీల అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధి, విద్య రంగాల్లో 4 శాతం రిజర్వేషన్ ప్రకారం బ్యాక్‌లాక్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. 2 సెంట్ల ఇంటి స్థలం, 2 ఎకరాల సాగుభూమి ఇవ్వాలన్నారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ యం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి నాయకులు రామాంజనేయులు, లక్ష్మీదేవి, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



విద్యార్థినికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-గార్లదిన్నె

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. అనంతరం నామట్టి-నాదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, ఎంపిడిఒ తేజోష్ణ, అధికారులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు శోచనీయం

ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓట్ల తొలగింపుతోపాటు దొంగ, నకిలీ ఓట్లు చేర్పించడం శోచనీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్ అన్నారు. సోమవారం ఉరవకొండలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో గెలవలేమని తెలిసి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కొంతమంది అధికారులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇలాంటి కక్కుర్తి పనులకు పాల్పడం సిగ్గుచేటన్నారు. ఓట్ల తొలగింపు విచారణలో ఎన్నికల అధికారి భాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడమేలిందుకు నిదర్శనమన్నారు. పదవి కోసం విశ్వేశ్వరరెడ్డి ఏమైనా చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. పదవీ కాంక్షతో నైతిక విలువలను దిగజార్చుకుంటున్న విశ్వేశ్వరరెడ్డి ఇప్పటికైనా తమ విధానాలను మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి జె.మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, ఉరవకొండ కార్యదర్శి తలారి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని రెండు పేద కుటుంబాలకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. చిన్న జలాలపురం గ్రామానికి చెందిన ఎం.రాములమ్మ, ఆదినారాయణ దంపతుల కుమారుడు యం.బాలు, మండల కేంద్రానికి చెందిన ఎం.గొల్లప్ప కుమారుడు ప్రేమ్‌నాథ్ వివాహానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, ముంతా వెంకటేష్, రంగస్వామి పాల్గొన్నారు.

సీఎం దసరా కానుకపై హర్షం

గుత్తి : సీఎం జగన్ దసరా కానుకగా ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఒక ఇస్తామనడంపై ఎపి వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని మండల విద్యాధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, నాయకులు కంబగిరి రాముడు, కొలంబస్ బాబు మాట్లాడుతూ ఎపి ఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభలకు ప్రత్యేక అతిథిగా హాజరైన సిఎం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వరాలజల్లు కురిపించారన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీతాలు, పిఎఫ్ రుణాలు, అర్జిత సెలవు నగదును కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ మండల నాయకులు ఓబులేసు, వెంకటరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భూమిని కాపాడాలని వినతి

ఉరవకొండ : పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ భూమిని కాపాడాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ ఉరవకొండ మండల కేంద్రంలోని సర్వే నెం.533 బి1లో 1941లోనే శ్రీ గాంధీ హరిజన హాస్టల్ పేరుపై 1.65 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే ప్రస్తుతం దీన్ని కొందరు అన్యాక్రాంతం చేసుకుని 23 సెంట్లు విక్రయించారన్నారు. దీనిపై గాంధీ హరిజన హాస్టల్ కమిటీ కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. మిగిలిన భూమిని కూడా ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు వన్నూరప్ప, సుభాష్, వెంకటేసులు, తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ జెఏసి నాయకులు

దొంగఓట్లు తొలగించే వరకూ పోరాటం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించే వరకూ తాము పోరాటం చేస్తూనే ఉంటామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మండలం వై.రాంపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత, పూర్వపు జెడ్పీ సీఈఓలు భాస్కర్‌రెడ్డి, శోభా స్వరూపరాణిలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయడాన్ని టిడిపి నాయకులు గొప్ప విజయం సాధించినట్లుగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వాస్తవానికి 2019-20, 21 సంవత్సరాల్లో ఓటర్ల సవరణ సందర్భంగా జరిగిన చిన్నచిన్న పొరపాట్ల కారణంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలకు ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలనకు (వేరిఫికేషన్) సంబంధం లేదన్నారు. అయితే అధికారులను సస్పెండ్ చేయడాన్ని తమ విజయం సాధించినట్లు టిడిపి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం వారి అవివేకం, అమాయకత్వానికి నిదర్శనమన్నారు. ఇదంతా పదివేల దొంగ ఓట్లను తొలగించాలని తాము చేసిన ఫిర్యాదును కప్పిపుచ్చేందుకే అన్నారు. ఎట్టిపరిస్థితుల్లో దొంగ ఓట్లపై తాము పోరాటం కొనసాగించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం




నాగరాజు భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న 14వ బెటాలియన్ కమాండెంట్ జగదీష్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గుండెపోటుతో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కుటుంబానికి 14వ బెటాలియన్ కమాండెంట్ జగదీష్ సోమవారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు కుటుంబానికి రానున్న రోజుల్లో కూడా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణ మూర్తి, డీఎస్పీలు దామోదరరావు, రమణమూర్తి, ఎఒ నాగభూషణమ్మ, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ లోకేశ్వరనాయుడు, సిసిఎస్ ఇన్‌ఛార్జి ఆర్ఎస్ఐ సురేష్, స్నేహితులు ఎఆర్ఎస్ఐ రాజూనాయక్, కృష్ణయ్య, బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదులో సమస్యలు పరిష్కరించాలి

ఎడిఎకి రైతుభరోసా సిబ్బంది వినతి




ఎడిఎ పద్మజకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్‌బికె సిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈక్రాప్ నమోదు యాప్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని రైతుభరోసా సిబ్బంది కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఎడిఎ పద్మజను ఉరవకొండ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న రైతు భరోసా సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్‌లో ఈక్రాప్ నమోదులో పంటల వివరాలు నమోదు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా జియో ఫెన్సింగ్ ప్రధానమైన సమస్యగా మారిందన్నారు. ఈ సమస్యతో రైతులకు సంబంధించిన సర్వే నెంబర్‌లోకి క్షేత్రస్థాయిలోకి వెళ్లిన పంటల వివరాలు నమోదు కావడం లేదన్నారు.స ర్వే నంబర్ ఉన్న పొలంలోకి వెళితే అదే సర్వేనెంబర్ వేరొక చోట చూపిస్తోందన్నారు. దీనికితోడు ఒక్కొక్క ఆర్‌బికె సిబ్బందికి 6000 నుంచి 8000 ఎకరాల వరకూ భూమిని కేటాయించడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఒక్కొక్క ఆర్‌బికె సిబ్బందికి 1500 నుంచి 2000 ఎకరాల కేటాయిస్తే నమోదు చేయడానికి సులభతరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ రైతు భరోసా యూనియన్ అధ్యక్షులు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు స్రవంతి, ట్రెజరర్ పరిమళ, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా జడ్పిటిసి 'నీలం'



నీలం భాస్కర్

బుక్కరాయసముద్రం : జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ (ఫుడ్ అడ్వైజరీ కమిటీ) సభ్యుడిగా బుక్కరాయసముద్రం జడ్పిటిసి నీలం భాస్కర్ ఎంపికయ్యారు. సోమవారం జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీని కలెక్టర్ ఎం.గౌతమి ప్రకటించారు. ఇందులో ఛైర్‌పర్సన్‌గా కలెక్టర్, కో ఛైర్‌పర్సన్‌గా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ ఉంటారు. వీరితోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నలుగురు జడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు. ఇలాంటి కమిటీలో బుక్కరాయసముద్రం జడ్పిటిసి నీలం భాస్కర్ ఎంపిక కావడం గమనార్హం. దీంతో మండల నాయకులు, అధికారులు భాస్కర్‌కు అభినందనలు తెలిపారు.


మొక్కలు నాటిన విప్ 'కాపు'



ప్రతిజ్ఞ చేస్తున్న విప్ కాపు, అధికారులు

రాయదుర్గం రూరల్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'నా భూమి -నా దేశం(నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే వసుధకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన మట్టి కళశాలను చేతిలో ఉంచుకొని పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిపి విద్యావతి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డివిజనల్ అభివృద్ధి అధికారి శంకర్, ఎంపిడిఒ కొండయ్య, తహశీల్దార్ మారుతి, ఇఒఆర్‌డి సురేష్, ఎపిఒ నీరజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు హద్దులు చూపాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రజకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలో రజకులకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలిచ్చిన స్థలాలకు హద్దులు చూపాలని కోరుతూ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ పట్టాలిచ్చి ఏళ్ల గడుస్తున్నా నేటికీ హద్దులు చూపలేదన్నారు. వెంటనే హద్దులు చూపడంతోపాటు ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగప్ప, మండల నాయకులు కుళ్లాయిస్వామి, శంకర, నాగేంద్ర, రంగనాయకులు, ఈశ్వరమ్మ, పెద్దక్క, వెంకలక్ష్మి, నరసింహులు, సంకప్ప, రామాంజనేయులు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1236.80 మెట్రిక్‌టన్నుల ఎరువులు



ఎరువులను తనిఖీ చేస్తున్న ఎడిఎ రవి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు కేటాయించిన 1236.80 మెట్రిక్ టన్నుల ఎరువులు సోమవారం ప్రసన్నాయపల్లి రేక్ పాయింట్‌కు చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ ఫర్టిలైజర్ కంపెనీకి చెందిన ఎంఒపి 111.60 మెట్రిక్ టన్నులు, డిఎపి 1125.20 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు తెలిపారు. వీటిని పరిశీలించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాప్తాడు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ ప్రసాద్, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.